వైఎస్సార్ ఆసరా సంబరాలు



నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ ఆసరా సంబరాలను మెప్మా ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పొదుపు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంబరాల్లో పాల్గొన్నారు. రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పొదుపు మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆసరా నాల్గో విడతకు సంబంధించిన రూ.17.07 కోట్ల నమూనా చెక్కును అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



క్లుప్తంగా

బీసీలకు వడ్డీలేని రుణాలివ్వాలి



నెల్లూరు(వేదాయపాళెం) : బీసీ యువత స్వయం ఉపాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీలేని రుణాలను మంజూరు చేసి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. విక్రమ్‌నగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, విజయ్, నగర కార్యదర్శిగా మహేంద్ర, నెల్లూరు రూరల్ కార్యదర్శిగా రాజాచారిని నియమించినట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ నేతలు శ్రీనివాసులు, సుధాకర్, ఆంజనేయులు, రమణయ్య, వెంకటేశ్వర్లు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం అభినందించారు. స్థానిక డీఎల్‌ఎన్నార్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ తదితర క్రీడల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు మెమెంటోలు అందజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో కూడా సత్తా చాటాలని వారు కోరారు.

కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకాలు



ముత్తుకూరు : ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ లీగ్‌లో గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. కర్నూలు వేదికగా ఈనెల 27, 28వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 జిల్లాల నుంచి 30 పాఠశాలలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో పలు విభాగాల్లో తమ స్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థిని సృష్టి, ఏడో తరగతి విద్యార్థిని లాస్యప్రియ, సోమిని బంగారు పతకాలు సాధించారని చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

నకిలీ విత్తనాల అమ్మకంపై చర్యలు

మనుబోలు : మండలంలోని చెర్లోపల్లి గ్రామ రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన నెల్లూరుకు చెందిన కావేరి సీడ్స్ దుకాణం లైసెన్స్‌ను అధికారులు రద్దు చేసినట్లు మండల ఏఓ షేక్ జహీర్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ నకిలీ వరి విత్తనాల కారణంగా వరిపైరు ముందుగానే వెన్ను తీయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేయగా నెల్లూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇటీవల వరిపైరును పరిశీలించి నకిలీ విత్తనాలు అని తేల్చిచెప్పినట్లు తెలిపారు. దీంతో కావేరి సీడ్స్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ వ్యవసాయ శాఖ వారు శనివారం నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కొడవలూరు : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి యల్లాయపాళేనికి చెందిన ఎస్ఎస్ఎన్‌పీ(స్టాండ్‌బై సపోర్ట్ ఫర్ నీడీ పీపుల్) ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. కోవూరు మండలం ఇనమడుగుకు చెందిన కే పెంచలయ్య గత కొద్ది రోజులుగా లివర్ సమస్యతో బాధపడుతున్నారు. వైద్యులను సంప్రదించగా శస్త్ర చికిత్స అనివార్యమని, అందుకు రూ.1.60 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన పెంచలయ్య వైద్యం కోసం ఫౌండేషన్ సభ్యులు సోమవారం రూ.20 వేలు అందించారు. దాతలు ముందుకొచ్చి సాయపడాలని విజ్ఞప్తి చేశారు.

నైపుణ్యాలను వెలికి తీయాలి

కోవూరు : ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి -2 వై.చెంచులక్ష్మమ్మ అన్నారు. పాటూరు పంచాయతీ పరిధిలోని పల్లిపాళెం, చెంచమ్మతోపు, చెక్కిరాల దిబ్బ ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేలా హెచ్‌ఎంలు తగిన చొరవ చూపా లన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

రేపట్నుంచి జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

- పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఈ నెల 31 నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణపై కార్పొరేషన్ అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఏ లోటు లేకుండా వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. మార్చి 3వ తేదీలోగా ఫైనల్స్ ముగించి విజేతలకు బహుమతులు అందజేయాలన్నారు. ఈ నెల 6న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాస్థాయి విజేతలను తీసుకెళ్లాలని సూచించారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ) భవనాన్ని కలెక్టర్ ఎం హరినారాయణన్ సందర్శించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో పాటు మీటింగ్ హాల్, వీడియోకాన్ఫరెన్స్ హాల్, డేటా కలెక్షన్, మున్సిపల్ సర్వీస్ మాడ్యూల్స్, సీసీ సర్వైలెన్స్‌ల విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల పనితీరును కలెక్టర్‌కు కమిషనర్ ఆత్యాధునిక సాంకేతికతతో కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరించారు. నగరంలోని 140 సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పారిశుధ్యం... సేవలు వార్డుల వారీగా ఒకే చోట నుంచి డాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. నెల్లూరు ఫర్ యు యాప్(లోకల్ యాప్) నుంచి రెవెన్యూ కలెక్షన్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, వార్డు సచివాలయాల సమాచారాన్ని సెంటర్ ద్వారా తెలుసుకునే అవకాశం కలిగిందని వివరించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, జిల్లా క్రీడాధికారి యతిరాజు, అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్‌సీపీలో కొత్తగా చేరే వారు రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 24వ డివిజన్‌కు చెందిన ఖాదర్‌బాషా, విజయ్,ప్రసాద్ వారి మిత్రబృందం 200 మంది కలిసి నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎంపీ ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామన్నారు. కొత్త, పాత వారు సమష్టిగా పార్టీ అభ్యున్నతికి పాటు పడాలన్నారు. రూరల్ నియోజవర్గం నుంచి తాను పోటీ చేస్తున్నానని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, 24వ డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలి

నెల్లూరు(బారకాసు): అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే బాధ్యత తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను పరిష్కరించిన అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని సూచించారు. కార్పొరేషన్‌లోని అన్ని విభాగాలధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

కమిషనర్‌ను కలిసిన నూతన జేసీ



నెల్లూరు(బారకాసు): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ్‌రాజేంద్రన్ కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌ను ఆయన ఛాంబర్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించారు.

స్క్రీనింగ్ క్యాంపు



నెల్లూరు (టౌన్): నెల్లూరు సంయుక్త ప్రాంతీయ కేంద్రం(సీఆర్‌సీ), విశ్వసాయి విద్యా సంస్థల సహకారంతో మాగుంట లేఅవుట్‌లోని డాక్టర్ ఎస్ఆర్‌కే విశ్వసాయి స్కూల్లో ఎల్‌కేజీ నుంచి 3వ తరగతి వరకు విద్యార్థులకు సోమవారం స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు చెవి, కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి అవి తీవ్రతరం కాకుండా తదుపరి పూర్తిస్థాయి పరీక్షలకు రావాలని సూచించారు. విశ్వసాయి విద్యా సంస్థల చైర్మన్ ఎన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురాం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాయప్పరెడ్డి, సీఆర్పీ ప్రతినిధులు కే ప్రవీణ్ కుమార్, స్పీచ్ పెథాలజిస్ట్ అండ్ అండియాలజిస్ట్ బీ శ్రీకాంత్, ఫిజియోథెరపిస్ట్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

5,6 తేదీల్లో ఖజానా ఉద్యోగుల క్రీడాపోటీలు

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వచ్చే నెల 5,6 తేదీల్లో ట్రెజరీ ఉద్యోగుల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఖజానా శాఖ ఉపసంచాలకులు డీ గంగాద్రి తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఖజానా శాఖలో పనిచేసే ఉద్యోగులందరూ క్రీడల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఏటీఓలు బీ లోకేష్ బాబు, ప్రసాద్, ఖజానా ఉద్యోగ సంఘ నాయకులు డీ రమణారెడ్డి, గోడ సుబ్రహ్మణ్యం, పీ కిరణ్ కుమార్, సయ్యద్ రెహమాన్, షేక్ జిలానీ, వై దయాకర్, వీవీ రమణరావు, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు బూడిద శ్రీనివాసులు, కే నరేంద్రబాబు, ఆర్ కొండలరావు, సాధు చంద్రశేఖర్, శివకాంత్ ప్రసాద్, ఆదిత్యవర్మ, పీవీ కిషోర్‌కుమార్, జీ అరుణమ్మ, బీ మమత తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఖాజానా శాఖ ఉపసంచాలకులు గంగాద్రి

సింగిల్ నంబర్లాటను కట్టడి చేయాలి

నెల్లూరు(క్రైమ్): కుటుంబాలను వీధి పాల్జేస్తున్న సింగల్ నంబర్లాటను కట్టడిచేయాలని సీపీఎం నగర నాయకులు కాయం శ్రీనివాసులు పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాయం శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో సింగల్ నంబర్లాట చాపకింద నీరులా విస్తరిస్తోందన్నారు. ప్రధానంగా ముత్తుకూరుగేటు సెంటర్, బాలాజీనగర్, సంతపేట, కోటమిట్ట, పొర్లుకట్ట, ప్రగతినగర్, ఎన్టీఆర్‌నగర్, రాయపపుపాళెం, తదితర ప్రాంతాల్లో జోరుగా సాగుతోందన్నారు. నిరుపేదలు రోజంతా కష్టపడిన సొమ్మును ఆటలో పెట్టి నష్టపోతున్నారని, ఫలితంగా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని విన్నవించారు. స్పందించిన డీఎస్పీ సింగల్‌నంబర్లాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున దాడులు చేసి అనేక మందిని కటకటాల వెనక్కి పంపామన్నారు. నగరంలో ఎక్కడైనా పేకాట, సింగల్ నంబర్లాటతో పాటు చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



నగర డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నేడు త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం

నెల్లూరు(బృందావనం): పుష్య బహుళ పంచమి సందర్భంగా వేదాయపాళెం, త్యాగరాజనగర్‌లోని సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు ఎనమండ్ర నాగదేవిప్రసాద్ సోమవారం తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేషాభిషేకాలు, అర్చనలు, నగర సంకీర్తన, పంచరత్న కీర్తనల గానం, బ్రహ్మశ్రీ మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

గాయకులు దరఖాస్తు చేసుకోవాలి

ఈ ఏడాది మార్చిలో జరుగనున్న భిక్షాటన పూర్వక త్యాగరాజస్వామి స్మరణోత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన సంగీత కళాకారులు ముందస్తుగా www.thyagarajasabha.nellore.inలో దరఖాస్తు చేసుకోవాలని త్యాగరాజ సేవా సమితి నిర్వాహకుడు ఎనమండ్ర నాగదేవి ప్రసాద్ తెలిపారు. వివరాలకు 94401 64423 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- మేయర్ స్రవంతిజయవర్ధన్
- పది విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని మేయర్ స్రవంతిజయవర్ధన్ ఆకాంక్షించారు. పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష సామగ్రిని మేయర్ స్రవంతిజయవర్ధన్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ విద్యను అందిస్తూ పేద విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నారన్నారు. పదో తరగతి విద్యార్థుల సులభంగా ఉత్తీర్ణత సాధించేలా మంచి ప్రణాళికతో పరీక్ష మెటీరియల్ అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు స్టడీమెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి నగర పాలక సంస్థకు మంచిపేరు తీసుకురావాలని మేయర్ ఆకాంక్షించారు.



పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన మేయర్, కమిషనర్

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన యూనియన్ రెండో రాష్ట్ర మహాసభలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా దుగ్గిరాల సూరిబాబు, అధ్యక్షుడిగా రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొజ్జ సుమన్, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా విజయరావును ఎన్నుకున్నారు. జిల్లా ఆఫీస్‌బేరర్లుగా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంరాజు, అనిల్, నాగరాజు, భీమేష్, కుమార్, ఆరోగ్యదాసు, రమణ, భాస్కర్, సభ్యులుగా మహేష్, నారాయణ ,ఆరీఫ్, రవికుమార్, రాజమోహన్, నాగరాజు, అనిల్, ఆదిశేషయ్య, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: దేవాదాయ ధర్మాదాయశాఖ ధార్మిక పరిషత్ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా పడారుపల్లిలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి సామూహిక కుంకుమార్చన జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మహిళలు కోలాటాన్ని ప్రదర్శించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానర్చకుడు రఘురాంశర్మ, వేదపారాయణదారుడు రామకృష్ణశర్మ, అర్చకుడు నరసింహ, ధర్మకర్తలు దొరబాబు, రామ్మోహన్‌రెడ్డి, భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పదహారు రోజుల పండగ



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం, మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో ఆండాల్ గోదాదేవి, శ్రీకృష్ణుని పదహారు రోజుల పండగను సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భోగి పండగ నాడు దేవదేవేరుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పదహారు రోజుల పండగను సంప్రదాయంగా నిర్వహించారు. కల్యాణ వేదికపై సర్వాలంకారశోభితంగా కొలువై దేవదేవరులు భక్తులను అనుగ్రహించారు. మందిరం ప్రధాన అర్చకుడు బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా మణికల లక్ష్మీనరసింహయాదవ్, పద్మ, భాగవతుల విజయరాఘవేంద్ర, శైలజ దంపతులు వ్యవహరించారు. మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు, మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు తిక్కవరపు శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, వేణుగోపాల్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



నెల్లూరు (వేదాయపాళెం): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ తిరుపతి నుంచి విజయవాడకు చేపడుతున్న పాదయాత్ర సోమవారం నెల్లూరుకు చేరుకుంది. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో పాదయాత్రకు బీసీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న నేషనల్ ధోబీ మహాసంఘ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. బీసీ సంఘ నేతలు దేవరాల సుబ్రహ్మణ్యం, శ్రీహరి, మాల్యాద్రి, రాము, విజయమ్మ, పద్మజ, బాలకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.